16

# వారసత్వం

ఊరు ఊరంతా రకరకాల పుకార్లతో అట్టుడుకినట్లు ఉడికిపోతోంది.

ప్రతీ అమావాస్య నాడు రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకు తెల్లని గుర్రం మీద నల్లని ముసుగులో ఒక భూతం ఆ వూరి వీధులలో పరుగు పెడుతుందట. ఆ గుర్రాన్ని అనుసరించి ఒక రాక్షసి వేటకుక్క కూడా వెళ్తుంటుందట.

ఈ పుకార్లు దావాగ్నిలాగా నగరమంతా వ్యాపించడంతో ప్రజలు చీకటి పడగానే వీధుల్లోకి రావడం మానుకొని, తలుపులు బిడాయించుకొని పడుకోసాగారు.

కొద్దిరోజులలోనే అవి వట్టి పుకార్లు కావని, నిజంగానే ఒక భూతం గుర్రం మీదవెళ్తోందని, వెంట వేటకుక్క కూడా ఉంటుందని రుజువయింది.

అదే ఊరిలో విజయుడు అనే వడ్రంగి ఉండేవాడు. అతడు ఎంతో ధైర్యసాహసాలు గలవాడు. దానికి తోడు- కాస్తో కూస్తో చదువుకుని దేశం నలుములలా తిరిగి లోకజ్ఞానం సంపాదించినవాడు.

అతనికి కులవృత్తి అయిన వడ్రంగం మీద మనసు ఉండేది కాదు. పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడితే మిగిలే డబ్బు కడుపునిండా తిండి తినడానికే సరిపోదు. అటువంటి పనిచేసి జీవచ్ఛవంలా బ్రతకడంకంటే, ఏదైనా సాహసకార్యం చేసి రాజుగారి మెప్పును పొంది ఆయన కొలువులో మంచి ఉద్యోగం చేయాలని కోరుకునేవాడు.

ఎప్పుడైతే నగరంలో తిరుగుతున్న భూతం సంగతి విజయుడికి తెలిసిందో... అప్పుడే ఆ భూతం అంతు తేల్చుకోవాలనుకున్నాడు. ఆ సాహసకార్యంలో ప్రాణం పోయినా ఫర్వాలేదనుకున్నాడు.

ఆ మరునాడే అమావాస్య..!



ఆనాడు ఆ భూతం సంగతి తెల్చుకోవడానికి ఒక పథకం వన్నాడు.

మర్నాడు రాత్రి ఆ భూతం వచ్చే మార్గంలో ఒక చెట్టుమీది కెక్కి, కొమ్మల్లో నక్కి కూర్చున్నాడు విజయుడు.

సరిగ్గా పన్నెండు గంటలు కావస్తుండంగా... దూరం నుంచి ఒడలు జలదరింపచేసే భయంకరమైన కుక్క అరుపు, ఆ వెనకే గుఱ్ఱపు డెక్కల చప్పుడు.., మరికొద్ది సేపటిలోనే ఆ ఆకారం దగ్గరగా వచ్చింది.

గుర్రం మీద నల్లని ముసుగులు ధరించిన ఒకవ్యక్తి , దానిముందు ఒక వేటకుక్క, అంతకన్నా ముందు మరో గుర్రంమీద చేతిలో కాగడాతో దారి చూపిస్తూ మరో వ్యక్తి వస్తూ కనిపించారు. ముందువ్యక్తి, వేటకుక్క దాటిపోగానే, ముసుగు మనిషి చెట్టు క్రిందికి రాగానే, విజయుడు ఒక్క ఉదుటున గుర్రం మీదికి దూకి , ఆ ఆకారాన్ని గట్టిగా పట్టుకున్నాడు.

ఈ హఠాత్సంఘటనతో గుర్రం బెదిరిపోయి ముందు కాళ్ళు పైకెత్తేసింది.

వెంటనే గుర్రం మీద నుంచి ఇద్దరూ క్రింద పడ్డారు. ఆ ఆకారం ముఖంమీదున్న ముసుగు తొలగిపోయింది.

విజయుడు ఆ వ్యక్తిని గట్టిగా పట్టుకుని "ఎవరు నువ్వు? ఎందుకు ప్రజల నిట్లా భయపెడుతున్నావు?" అని నిగ్గదీశాడు.

ఈ అలజడికి ముందుగా వెళ్లిన కాగడా వ్యక్తి వెనక్కి వచ్చాడు. వేటకుక్క కూడా వెంట వచ్చింది. ఆ కాగడా వెలుగులో ముసుగు వ్యక్తి మరెవరో కాదు.., ఆ దేశపు రాజుగారేనని గుర్తించాడు విజయుడు.

రాజుగారు ప్రమాదంలో ఉన్నారని భావించి కాగడావ్యక్తి కత్తితీసి విజయుడి మీదకు దూకబోయాడు. వేటకుక్క కరవబోయింది. రాజు వారిని వారించి, "శభాష్!" అంటూ విజయుని భుజం తట్టాడు.

"నాయనా... నేను ముసలివాడినయి పోతున్నాను. నాకు పిల్లలు లేని కారణంగా, నాతో నా వంశం అంతమవుతుంది. ఈ రాజ్యాన్ని రక్షించడానికి నీ వంటి ధైర్యసాహసాలుకల యువకుడు అవసరం. అందుకే ఈ పుకార్లు సృష్టించి ఈ విధంగా అన్వేషిస్తున్నాను. ఈ నాటికి నా శ్రమ ఫలించి నువ్వు కనిపించావు. నువ్వే ఈ రాజ్యానికి భావి మహారాజువి!" అని సాదరంగా తనవెంట తీసుకువెళ్లాడు.

అన్న మాట ప్రకారం... రాజుగారు అచిరకాలంలోనే విజయుడికి పట్టాభిషేకం చేసి తాను వనవాసానికి వెళ్లిపోయాడు.

విజయుడి పాలనలో ప్రజలు ఎంతగానో సుఖించారు.

★★★

